క్లుప్తంగా

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

తిరుపతి సిటీ: స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ దేవసహాయం, ఎస్వీ యూ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి దామోదరం, డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై ద్వారకనాథరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లిలో ఉన్న అలివేలు మంగమ్మ, వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం పెరటాసి నెల నాలుగో శనివారం సందర్భంగా నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, నైవేద్యం, ధ్వజారోహణం, గోపూజ, గణపతిపూజ, నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో అభిషేకం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేసి, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్లను ఊరేగించారు.

కార్మికుల తొలగింపు దారుణం

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో దాదాపు 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్టర్ భాస్కర్ నాయుడు తొలగించడం దారుణమని సీఐటీయూ నాయకులు అన్నారు. రుయాస్పత్రి ప్రాంగణంలో శనివారం తొలగించిన కార్మికులతో కలసి సీఐటీయూ నాయకులు నిరసన దీక్షలు ప్రారంభించారు. రుయాస్పత్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కే వేణుగోపాల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పేదలు, వృద్ధులకు అన్నదానం



తిరుపతి కల్చరల్: దళిత సీనియర్ నేత మల్లారపు మధు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 75వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం కపిలతీర్థం అలిపిరి రోడ్డులోని శ్రీపద్మావతి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. వృద్ధులకు, సుమారు 500 మంది పేదలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. దళిత మల్లారపు మధు, శ్రీపద్మావతి వృద్ధాశ్రమం నిర్వాహకుడు మునీంద్రనాయక్, హేమసుందర్ రెడ్డి, క్రిష్ణకుమార్, చినరాయుడు, శ్రీరాములునాయక్, హరిప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు పరిశీలన

తిరుపతి అర్బన్: దీపావళి పండుగ రానున్న నేపథ్యంలో వ్యాపారులకు టపాసులను విక్రయించడానికి ఏఏ ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాలనే అంశంపై అధికారులు పరిశీలన చేపట్టారు. శనివారం తిరుపతి నగరంలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. గతంలో ఇచ్చిన ఆరు కేంద్రాల వద్దే తిరిగి ఇవ్వాలా? లేదా పెంచాలా? తగ్గించాలా? అనే అంశాలపై కసరత్తు చేస్తున్నారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్ర పాల్గొన్నారు.

కేసీ పేటలో అఖండ భజన

తిరుపతి రూరల్: మండలంలోని కేసీపేటలో ఉన్న శ్రీరామమందిరంలో పెరటాసి మాసం నాలుగో శనివారం సందర్భంగా గ్రామస్తులు తిరుపతి వెంకటరమణ ఆధ్వర్యంలో అఖండ భజన నిర్వహించారు. శనివారం ఉదయం 7 నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు నిరాటంకంగా భజనలు చేశారు. అఖండ భజన చేస్తున్న భక్తులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు.

ర్యాగింగ్ వద్దు..స్నేహమే ముద్దు

తిరుపతి రూరల్: ర్యాగింగ్ వద్దు, స్నేహమే ముద్దు అని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు అన్నారు. మండలంలోని సి.గొల్లపల్లి వద్ద ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ర్యాగింగ్‌తో అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ నిపుణులు జ గదీష్ ప్రసాద్, కాలేజీ ప్రిన్సిపల్ డా.కె.రాజశేఖర్, డా.పి.రవి, జి.నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఊబకాయం హానికరం

తిరుపతి కల్చరల్: ఊబకాయం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైందని, బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్‌లో ఈ ఊబకాయ సమస్యను బేరియాట్రిక్, మెటబాలిక్ సర్జరీతో పరిష్కరించవచ్చని మణిపాల్ హాస్పిటల్ సౌత్ ఇండియా రీజియన్ బేరియాట్రిక్, మెటబాలిక్ సర్జరీ డైరెక్టర్ డాక్టర్ జి.మొయినోద్దీన్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు చిన్న వయస్సులోనే ఊబకాయంతో పలువురు అనారోగ్యం బారినపడుతున్నారన్నారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- వే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో భాగంగా మహతి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటల నుంచి భారతీయ సాంస్కృతిక ఉత్సవం.
- విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రాస్ భవన్‌లో ఉదయం 10 గంటలకు గార్లపాటి పురస్కారాల ప్రదానోత్సవం.
- బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా ప్రకటించాలనే అంశంపై చర్చా సమావేశం.
- పవిత్రోత్సవాల్లో భాగంగా చంద్రగిరిలోని శ్రీకోదండరామాలయంలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం పవిత్ర హోమాలు.

ఏడుకొండల స్వామీ..

ఏమిటీ పిచ్చిపనులు!

- బోర్డు కనిపించలేదంటూ బస్టాండ్‌లోని చెట్ల తొలగింపు



దగ్గరుండి చెట్లను కొట్టిస్తున్న తిరుపతి బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్



బస్టాండ్ ముందు భాగంలో నరికి వేసిన చెట్లు

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని చెట్లను అధికారులు శనివారం ఇష్టారాజ్యంగా తొలగించేస్తున్నారు. దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు గ్రీనరీలో భాగంగా ఏర్పాటు చేసిన చెట్లను తొలగించడాన్ని ఆర్టీసీ ఉద్యోగులే తప్పుపడుతున్నారు. ఆర్టీసీ అధికారులు చేస్తున్న పిచ్చిపనులపై ప్రయాణికులు బాహాటంగానే విమర్శలు గుప్పించారు. గతంలో పనిచేసిన అధికారులు బస్టాండ్ ప్రధాన ద్వారమైన దక్షిణం వైపు ప్రయాణికులు లోనికి వచ్చే మార్గంలో ఆర్టీసీ ప్రాంగణంలో చెట్లను ఏర్పాటు చేయడంతోపాటు ఎంతో శ్రమించి చక్కగా పెంచారు. అయితే ప్రయాణికులకు లేదా బస్సులకు చెట్లు ఏదైనా అడ్డుగా ఉన్నా లేదా నిర్మాణాలు చేపడుతుంటే చెట్లు అడ్డుగా ఉన్న తొలగించడంలో తప్పులేదు.ఏ కారణం లేకుండానే అధికారులు బోర్డు కనిపించడం లేదంటూ చెట్లు తొలగిస్తున్నారు. కొందరు ఉద్యోగులు చెట్ల తొలగింపుపై అధికారులను ప్రశ్నిస్తే బస్టాండ్‌కు చెందిన బోర్డు సక్రమంగా కనిపించడం లేదని... చెట్లను తొలగిస్తే బోర్డు కనిపిస్తుందని సమాధానం ఇవ్వడంపై తీవ్రంగా తప్పుబడుతున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ అంటూ నాలుగు వైపులా బోర్డులు ఉన్నాయి. ఒక వేళ కనిపించకుంటే 13.5 ఎకరాల స్థలం కల్గిన బస్టాండ్‌లో మరోచోట బోర్డును ఏర్పాటు చేస్తే సరిపోతుందని పలువురు సూచిస్తున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు వాటిని పట్టించుకోకుండా తొలగించేస్తున్నారు.

> **బోర్డు కనిపించడం లేదు**
>
> బస్టాండ్ బోర్డు సక్రమంగా కనిపించడం లేదు. దీంతోనే చెట్లను తొలగిస్తున్నాం. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ బోర్డు స్పష్టంగా కనిపించాలంటే చెట్లను పూర్తిగా తొలగిస్తేనే కనిపించేలా ఉంది. అందుకే తొలగించడం జరిగింది.
>
> – సంధ్య, అసిస్టెంట్ మేనేజర్, తిరుపతి బస్టాండ్


బస్టాండ్‌లో రద్దీ



తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అర్బన్: రెండు రోజుల సెలవుల నేపథ్యంలో తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నీ బస్సులు హౌస్‌ఫుల్‌గానే కనిపించాయి. బస్సు ఆగిన నిమిషాల్లో ఫుల్ కావడంతోపాటు స్టాడింగ్ జర్నీలతో శనివారం ప్రయాణికులు గడిపేశారు. దీనికితోడు ప లుమార్గాల్లో అవసరం అయిన మేరకు బస్సులు లేకపోవడం, మరోవైపు స్త్రీశక్తి పథకం నేపథ్యంలో బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది.

కేదార్‌నాథ్‌లో భూమన దంపతులు



కేదార్‌నాథ్ శివాలయంలో భూమన దంపతులు

తిరుపతి మంగళం : ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్ శివాలయాన్ని శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. మందాకిని నది ఒడ్డున, సముద్ర మట్టానికి 3,584 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర స్థలంలో వెలసిన మహాశివుడిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా బావిస్తున్నామని భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఇంతటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

పాలియేటివ్ కేర్ శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా: రుయాస్పత్రిలో పాలియేటివ్ కేర్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ రోగులు సహాయకులకు, ఇక్కడ స్పెషలిస్ట్ డాక్టర్ ద్వారా శిక్షణ ఇప్పించి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఎలా సహాయ పడాలనే ప్రధాన లక్ష్యంతో శిక్షణ ప్రారంభించామన్నారు. వారికి శిక్షణ, అవగాహన కల్పించి మారుమూల ప్రాంతాల్లో ఇంటి వద్దే క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించే విధానం గురించి పూర్తిగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా కౌన్సెలింగ్ సైకాలజిస్టు, సోషియాలజిస్టు, ఫిజియోథెరపిస్టు, న్యూట్రిషనిస్టు క్యాన్సర్ రోగి సహాయకులకు శిక్షణ ఇవ్వడంలో అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జే రాధ, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీలా, తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, తిరుపతి రోటరీ క్లబ్ సభ్యులు, బీఆర్ శ్రీధర్, డిస్టిక్ గవర్నర్ రోటరీ క్లబ్, ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



జ్ఞాపిక అందజేస్తున్న ఏఎస్పీ, కళాశాల చైర్మన్

తిరుపతి సిటీ: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నూతనంగా బీటెక్ కోర్సులో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయసాధన కోసం శ్రమించాలని సూచించారు. ఏఎస్పీ రవిమనోహరాచారి మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి, ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులపై ప్రత్యక్ష స్వీయ పరిశీలన చేస్తున్నామన్నారు. పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. రేణిగుంట డీఎస్పీ శివప్రసాద్, సీఐ జయచంద్ర, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపల్ వాసు పాల్గొన్నారు.

ఎస్వీ వెటర్నరీలో మైత్రిపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న వీసీ రమణ

చంద్రగిరి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఆవిష్కరించిన మల్టిపర్పస్ ఆర్టిఫియల్ ఎన్స్‌సెమినేషన్ టెక్నీషియన్ ఇన్ రూరల్ ఇండియా(మైత్రి) కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ వీసీ జేవీ రమణ, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ ఆలోచనలతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ పాల అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ), పశుసంవర్ధక, పాల ఉత్పత్తి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



పెన్షనర్లను, రాష్ట్ర నాయకులను సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పాకాల పెన్షనర్స్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్.మునస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎస్‌పీ శాస్త్రి హాజరయ్యారు. అసోసియేషన్ నాయకులు గురురాజారావు, జయరాంనాయుడు, కేఆర్.శంకర్, జి.ఆంజినేయులు, ఎస్‌టీఓ జ్ఞానప్రసన్న, కుప్పుస్వామినాయుడు, తులసీరామన్, సర్పంచ్ కస్తూరి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా శనివారం విజయవాడకు చెందిన శ్రీనృత్య కళాంజలి, నాట్యాచార్య జోస్యుల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు వెంకటేశ్వర్లు, రేవతి, భవిత, శ్రీహరిణి, భవ్య, శ్రీధన, శ్రీహేత్విక, మాన్విత, రాంబాబు, వినయ, శ్రీచర్విప్రియ, జ్యోత్స్న, భవిష్య, గోవర్ధన చూడచక్కని నాట్య ప్రదర్శన చేశారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

పీఎల్ఆర్ క్యాండీలో దసరా పూజలు



పూజలు చేస్తున్న హోటల్ నిర్వాహకులు

చంద్రగిరి: మండలంలోని తొండవాడ సమీపంలోని పీఎల్ఆర్ క్యాండీలో శనివారం దసరా పూజలను ఘనంగా నిర్వహించారు. కస్టమర్ల కోసం కొద్ది రోజులుగా హోటల్‌తో పాటు రిసెప్షన్, వెయిటింగ్ రూం, బార్లకు మరమ్మతులు చేశారు. బార్‌కు వచ్చే కస్టమర్ల కోసం ప్రత్యేక డిజైన్‌తో పాటు అత్యాధునిక హంగులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం హోటల్ నిర్వాహకులు ప్రత్యేక పూజలను నిర్వహించి, సేవలను పునఃప్రారంభించారు.

చేనేత, హస్తకళా ప్రదర్శనకు విశేష ఆదరణ



ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోందని ప్రదర్శన మేనేజర్ బిజుమండల్ తెలిపారు. ఈ ప్రదర్శనలో పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు, పోచంపల్లి డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్లు, షూటింగ్స్, షర్టింగ్స్, బెడ్‌షీట్స్ ఉన్నాయన్నారు. ఇవే కాక సరికొత్త డిజైన్లతో కూడిన జ్యువలరీ ఆభరణాలు ఏర్పాటు చేశామన్నారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారీ తదితర చీరలతో పాటు హరియానా బెడ్ కవర్లు, కేషన్ కవర్లు, లక్నో కుర్తీలు, డోర్ కర్టన్స్, బంజారా కోల్‌కతా బ్యాగులు, ఒడిశా పెయింటింగ్స్, మధ్యప్రదేశ్, చందేరి, మహేశ్వరి, రాజస్తాన్ కోటా బాందేజన్ డ్రెస్ మెటీరియల్స్, ఉత్తర ప్రదేశ్, జామ్దాని చేనేత హస్తకళ వస్తువులు ప్రదర్శనలో ఉన్నాయని పేర్కొన్నారు.

గుండ్లూరుకు బంగారు నంది అవార్డు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి గుండూరు సుబ్రమణ్యానికి బంగారు నంది అవార్డు లభించింది. మ్యాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో శనివారం సౌత్ ఇండియా బంగారు నంది అవార్డులు–2025 ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంపై ఆయన అందించిన జానపద కవితలతో పాటు అనేక రచనలను గుర్తించి, ఆయనకు ఉత్తమ రచయితగా ఎంపిక చేశారు. నిర్వాహకులు ఆయన్ని తెలంగాణ ఎమ్మెల్సీల చేతుల మీదుగా బంగారు నంది అవార్డుతో ఘనంగా సత్కరించి అభినందించారు.

పాలమిత్రలకు మిక్సీల పంపిణీ

పాకాల: మండలంలోని దామలచెరువు బీఎంసీ పరిధిలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉన్న పాలమిత్రలకు దీపావళి కానుకగా మిక్సీలను పంపిణీ చేశారు. శనివారం పాకాల ఏరియా మేనేజర్ ఎ.ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ ఆర్గనైజేషన్ పాలమిత్రల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బహుమతులను అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ నిత్యనందరెడ్డి, శ్రీజ పిఐబి అధికారి నిరోష పాల్గొన్నారు.

సమాజ సేవ జీవిత సాఫల్యానికి మార్గదర్శకం



డాక్టర్ గోపాల్‌కు డాక్టర్ కలాం విశిష్ట పురస్కారంతో సత్కరిస్తున్న వక్తలు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సామాన్య స్థాయి నుంచి దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన గొప్ప విజ్ఞాన వంతుడు, సేవా తత్పరుడు అబ్దుల్ కలాం అని, నిస్వార్థమైన సమాజ సేవ మనిషి జీవిత సాఫల్యతకు మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి, ట్రస్ట్ వార్షిక వేడుకలను శనివారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు డాక్టర్ సుబ్రమణ్యం, స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత డాక్టర్ లింగుట్ల రమేష్‌నాథ్, తిరుపతి సిటీ చాంబర్ ఆయూబ్ ఖాన్, తహసున్నీసా బేగం, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి హాజరై ప్రసంగించారు. కలాం ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీవెల్ల బాషా పాల్గొన్నారు.

పాకాల జేవీవీ కార్యవర్గం ఎన్నిక



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

పాకాల: జన విజ్ఞాన వేదిక పాకాల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక ఇండియన్ స్కూల్‌లో ఎన్నుకున్నారు. శనివారం తిరుపతి జిల్లా జేవీవీ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప ఆధ్వర్యంలో మండల జేవీవీ అధ్యక్షుడిగా మొగరాల జెడ్పీ హైస్కూల్ భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు వనపర్తి వెంకటసిద్దులుని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఇండియన్ స్కూల్ అధినేత సాత్యకి, ఉపాధ్యక్షుడిగా ఒడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జయచంద్ర, సహాయ కార్యదర్శిగా ఓబులశెట్టివారిపల్లి జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణబాబు, కోశాధికారిగా దామలచెరవు జెడ్పీ హైస్కూల్ వ్యాయామ సంచాలకుడు గణపతిని ప్రకటించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను నూతన కార్యవర్గం సభ్యులు ఆవిష్కరించారు. సభ్యులు మధు, లక్ష్మి, షాతాజ్ పాల్గొన్నారు.